కథానిక

# అబల

భరణి

దూరాన చర్చ్ గడియారం ఎనిమిది కొట్టింది. వంట పూర్తి చేసుకొని రాధ గుమ్మం ముందు నిలుచుంది. సుదర్శనం యింకా యింటికి రాలేదు. ఆఫీసు వొదిలేది ఐదు గంటలకే అయినా, అతడు యింటికి చేరేది మటుకు రాత్రి పది దాటిన తర్వాతే!

తను వొచ్చిన కొత్తలో ఆఫీసు నుంచి నేరుగా యింటికి వచ్చేసేవాడు. రోజూ తనకు పువ్వుల పొట్లం తీసుకొచ్చేవాడు. తన మీద అతని కున్న ప్రేమనూ, అనురాగాన్నీ తలచుకుని తన అదృష్టానికి మురిసిపోయేది. తన గత జీవితపు లోతుపాతుల్ని మర్చిపోతుండేది.

అయితే—

ఇప్పుడతను పూర్తిగా మారిపోయాడు. తనతో మాట్లాడాలంటేనే అతనికి అసహ్యంగా వుంటోంది. తను దగ్గరికి వెడితే చీడపురుగును చూసినట్టు చూస్తాడు. తను చేసిన తప్పేమిటో తెలియదు—చెప్ప కూడదూ!

రెండు నెలల నుంచీ యమయాతన అనుభవిస్తోంది. అతనితో మున్ముందు తన జీవితం ఎలావుండబోతుందో తలచుకోటానికే భయం వేస్తుంది.

తన మీద అంత యిష్టం లేనివాడు తన నెందుకు లేవదీసుకు రావాలి? పండంటి కాపురాన్ని, నడి వీధిలో వొదిలి తనేదో బావుకునేట్టు యితనితో లేచి వచ్చేసింది.

తన భర్త—చాల మంచివాడు, అమాయకుడు, తనంటే ఆయనకు ప్రాణం, ప్రతి నెలా జీతమంతా తనకేయిచ్చి ఖర్చు పెట్టమనేవాడు.

ఏ పని చేసినా ముందు సలహా అడిగి కాని చేసేవాడు కాదు. కోపమనేది ఎప్పుడూ ఎరగడు—సదా నవ్వుతూ వుండేవాడు.

సుదర్శనం వ్యక్తిత్వమే వేరు. అతను మొదటినుంచీ తనమీద అధికారమే చెలాయిస్తూ వచ్చాడు. మొట్టమొదటిసారి తనను బలవంతంగానే తన కౌగిట్లోకి చేర్చుకున్నాడు. ఇక్కడికి లేవదీసుక రావటం కూడ బలవంతంగానే - ఎన్నోరకాల ఆశలు రేపి మభ్యపెట్టి యిక్కడికి తీసుకొచ్చాడు.

అతనిలో ఏదో ఒక వింతశక్తి, ఆకర్షణ వున్నాయి, ఇదమిత్థంగా ఫలానా అని తను నిర్వచించలేదు. అతను చేతులు చాచినప్పుడు, తను మంత్రం వేసినట్టు అన్నీ మర్చిపోయి అతని కౌగిట్లో లీనమైపోతుంది.

ఎన్నోసార్లు అనుకునేది—"ఈ సారి అతన్ని నా దగ్గరకు రానివ్వను—రానివ్వకూడదు" అని. కాని, తను అబల!

మొదట తను నిరాకరించినా. చివరికి అతనిదే గెలుపు. అధికారయుతంగానే తనను ఆక్రమించేవాడు. ఓటమిని మౌనంగా అంగీకరించవలసి వచ్చేది.

"చంద మామ రావే—జాబిల్లి రావే" రాధ ఉలిక్కిపడి వీధిలోకి చూసింది. ఎదురింటి వసంత కొడుకును ఎత్తుకుని చందమామను చూపిస్తూ అన్నం తినిపిస్తూంది.

అప్రయత్నంగా రాధ కళ్లు చెమ్మగిల్లాయి. తను యిద్దరు పిల్లల తల్లి. ఇద్దరినీ వొదిలేసి యితనితో వొచ్చేసింది. తనది ఎంత రాతి గుండె! వాళ్ళు పాపం తల్లిలేని బిడ్డలుగానే పెరుగుతారు. తను మళ్ళా, భర్త దగ్గరికి వెళ్ళిపోతేనో,—పోవచ్చు. ఆయన చాల మంచివాడు. తనను ఏనాడో క్షమించారు. తను సుదర్శనంతో వొచ్చేశాక, ఆయనకు అడ్రసు ఎట్లా తెలిసిందో ఒకసారి జాబు రాశారు.

ఆ జాబు చదివిన తర్వాత కూడ తన మనసు ఎందుకు కరిగలేదో యిప్పటికీ ఆశ్చర్యంగానే వుంది. రాధ లోపలకు వెళ్ళి, పెట్టె

అడుగున దాచిన ఉత్తరం తీసింది, దీపం ముందు దాన్ని మనసులో చదువుకుంది—

ప్రియమైన రాధా!

నేను నీకేం ద్రోహం చేశాను చెప్పు? నన్నూ, నా బిడ్డల్నీ యిట్లా ఒంటరిగా ఒదిలేసి వెళ్ళటం న్యాయమా! ఏనాడైనా నేను నిన్ను పల్లెత్తు మాట అన్నానా? చెయ్యెత్తి కొట్టానా? ఏమిటి నేను చేసిన తప్పు?

పోనివ్వు—నా విషయం వదిలెయ్. పాపల సంగ తేమిటి? వాళ్ళు నీకోసం ఎంతగా ఏడుస్తున్నారో తెలుసా! 'మాతృ హృదయం' అంటారే స్త్రీది. ఆ మాతృ ప్రేమ నీలో ఏమైంది? నువ్వెక్కడవున్నా సుఖంగా వుండటమే నేను కోరేది. నీకు అక్కడే సౌఖ్యం లభించగలదన్న ఆశవుంటే అక్కడే వుండు. అయితే, నువ్వు మళ్ళా యిక్కడకు రానివ్వనేమోనని సంకోచించ నక్కరలేదు. నీకోసం నా యింటి తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయి, ఉంటాను. సదా నీ క్షేమం కోరుతూ—

నీ భర్త శివం.

రాధకు ఏడవా లనిపించింది యిప్పుడు. ఒకప్పుడు యిదే ఉత్తరాన్ని అవహేళనగా చదివేసి పెట్టె అడుగున పారేసింది.

శివం మనసు పాలరాయి వంటిది. అతనికీ, సుదర్శనానికీ పోలిక ఎక్కడ! తన భర్త అమాయకత్వానికీ నిష్కల్మష హృదయానికీ జాలి పడింది.

తను మళ్ళా ఆయన దగ్గరకు వెళ్ళిపోతే—దైవం వంటి భర్త. ముద్దు వచ్చే యిద్దరు పిల్లలు. తనకు అంతకంటే ఏం కావాలి? ఈ నరకం కోరి తెచ్చుకున్నది. సుదర్శనం తనను కాకపోతే మరొక స్త్రీని ప్రేమించ గలడు. కాని తన భర్తకు తనొక్కతే భార్య! ఆయన తనను తప్ప ఎవ్వరినీ ప్రేమించలేడు.

పేలవంగా నవ్వుతుంది. ఉత్తరం పెట్లో పడేసి గుమ్మం ముందు నిలుచున్నది సుదర్శనం వస్తాడేమోనని.

వీధిలో జనసమ్మర్దం బాగా తగ్గిపోయింది. చర్చిలో తొమ్మిది కొట్టింది గడియారం. సుదర్శనం రాలేదు. నిట్టూరుస్తూ తలుపు జారవేసి, మంచం మీద పడుకుని ఆటూ యిటూ దొర్లసాగింది.

ఎప్పుడు వచ్చాడో సుదర్శనం వస్తూనే పెద్దగా కేకలు పెట్టసాగాడు: "ఇది సత్రం గాని కొంప గాదు. దొంగలొచ్చి దోచుకుపోయినా దొరసాని మాత్రం కుంభకర్ణుడి చెల్లెలిలా నిద్రపోతూనే వుంటుంది."

మగత నిద్రలోవున్న రాధ యీ మాటలు విని ఉలిక్కిపడి లేచింది.

"ఎప్పుడు వచ్చారు?" అంది లేస్తూ.

"ఎప్పుడు వస్తే ఏం? అసలు నేననేవాణ్ణి ఉన్నాననే మర్చిపోయావు. హాయిగా కడుపు నిండా తిని నిద్రపోతున్నావు. ఇంట్లో సామానంతా దొంగలు దోచుకు పోతారు. నీకేం— నీ సొమ్మయితే గదూ"—

రాధ గుండెల్లో ఆ మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి.

"అట్లాంటి మాట లనకండి" అంది బాధగా.

"ఇంకెట్లాంటి మాట లనమన్నావు? కట్టుకున్న మొగుణ్ణీ, కన్న పిల్లల్నీ ఒదిలేసి ఊరు మీద పడ్డదానికి మాటల విలువ కూడ తెలుసన్నమాట. సిగ్గులేదూ, మాట్లాడటానికి? తలుపులు బార్లా తీసుకుని, గుమ్మం ఎదురుగా మంచం మీద వెల్లకిలా పడుకుంటే, దారిన పోయే నలుగురూ చూస్తారన్న విచక్షణ జ్ఞానం కూడ లేదు నీకు."

"మన యింట్లో మనం పడుకోవటమూ తప్పేనా?" రాధకు తను చేసిన తప్పేమిటో అర్థం కాలేదు.

"మన యిల్లని బట్టలు విప్పుకు తిరగలేక

పోయావ్ ? సిగ్గులేకపోతే సరి.''

రాధకు పెద్ద పెట్టున ఏడవా లనిపించింది. "నేను యిక యిక్కడ ఒక్కక్షణం కూడ వుండను. వెళ్ళిపోతాను'' అని చెప్పాలనుకుంది.

కాని - నోటి వెంట మాట రాలేదు. చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్వసాగింది. సుదర్శనం బట్టలు విప్పి, లుంగీ కట్టుకు కున్నాడు. ''కూడు పెట్టదలచుకున్నావా లేదా ?'' అన్నాడు.

రాధ నిశ్శబ్దంగా లేచి అన్నం వడ్డించింది. సుదర్శనం మాట్లాడకుండా తింటు న్నాడు. రాధ అనుక్షణమూ భయపడుతూ అక్కడే కూర్చుంది, అతని భోజనం ముగిసే వరకు.

''నువ్వు తిన్నావా?'' మాట వరసకి అడిగి నట్టు అడిగాడు,

"లేదు'' అంది మెల్లగా.

అబద్ధం అనుకున్నాడు. ''ఎందుకుతినలే?''

''మీరు తినాలి గదా ?''

''మహా అభిమానం వున్నట్టు___''

రాధ స్వాభిమానం దెబ్బతిన్నది.

''ఎందుకు నన్నిట్లా సూటీపోటీ మాటలతో బాధ పెడ్తారు. నే నేం తప్పుచేశానో చెప్పగూడదూ ?'' అంటూ ఏడ్చింది పెద్ద గానే చేతులతో మొహం కప్పుకుని.

సుదర్శనం అన్నం సగంలో వదిలేసి వెళ్ళి చెయ్యి కడుక్కున్నాడు.

రాధ బ్రతిమాల లేదు. కళ్ళు తుడుచుకుని, రెండు మెతుకులు గతికింది, అవి కూడ సహించలా.

వంటింట్లో లైటార్పి, ముందు గదిలోకి వెళ్ళింది. సుదర్శనం మంచం మీద పడుకుని నిద్ర పోతున్నాడు.

మౌనంగా లైటార్పి, నేలమీద చీర కప్పుకుని పడుకుంది తన కుక్కబ్రతుకును తలచు కుంటూ, ఎప్పుడు నిద్ర వచ్చిందో తెలియనే లేదు రాధకు.

రాత్రి ఎప్పుడో - ఇనుప చువ్వల్లాంటి రెండు చేతులు తనని పెనవేసుకోవటం ఆమెకు వూహామాత్రంగా తెలుసు. వాటిని దూరంగా తోసివేయాలని, తను లొంగి పోకూడదని అనుకుంది ఆమె.

కాని ఆమె అశక్తురాలు-అబల. అందుకే ఆ రెండు చేతులూ ఆమెను మరింత దగ్గరగా లాక్కోగలిగాయి.

## విమర్శకులకు క్రిషన్‌చందర్ సమాధానం

_ ''నన్ను విమర్శించే రెండు రకాల వారి విమర్శల్లో కూడా (క్రిషన్ చందర్‌ను కొందరు కేవలం ప్రచారకుడు అంటారు; ఆయన రచనలు ప్రచార కరపత్రాలు అంటారు. మరికొందరు ఆయన వట్టి కాల్పనికుడంటారు__సం.) కొంత కొంత సత్యం వుంది. నా రచనా వ్యాసంగం సామాజిక పరిసరాలనే పట్టకం గుండా పయనించి సాహిత్య రూపంలో ప్రతిఫలిస్తుంది. కళా సాహిత్యాలకు ఎలాంటి సామాజిక సంబంధం వుండ రాదనే వారు దాన్ని ప్రచారం అని నిందిస్తారు. కాగా, జీవితమనే యింద్ర ధనస్సు రంగుల్ని చూచి భీతిల్లేవారు, యింద్ర ధనస్సులో ఎరుపు, నీలం, పసుపు రంగుల్లో ఏదో ఒక్కటి మాత్రమే వుండాలని కోరేవారు నేను కాల్పనికుణ్ణని విమర్శిస్తారు.''